క్లుప్తంగా

వైభవంగా నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు ఆత్మకూరి రవి, గొడవర్తి గిరి, సంతోష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వర్క్‌షాప్స్‌తో మేధస్సుకు పదును



వర్కుషాపులో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం: పినగాడిలోని వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ యూజింగ్ ఆర్ఐఏఎంపై వర్కుషాప్ నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.శివకుమార్ , బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.సుందర్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్ఐఏఎం సాఫ్ట్‌వేర్ నేర్చుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. ఇలాంటి వర్కుషాప్స్ వల్ల విద్యార్థుల మేధస్సు పెరుగుతుందన్నారు. కార్యక్రమంంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాషువా, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

బీమా పరిహారం అందజేత



మృతుడు భార్య లక్ష్మికి బీమా పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తమ పార్టీ నాయకుడు కడుపుట్ల అప్పలనాయుడు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం మేజర్ పంచాయతీలోని చిన గొల్లలపాలెం శివారు గోపాల్‌నగర్‌లో నివాసం ఉంటున్న అప్పలనాయుడు కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే పరామర్శించారు. అతడి భార్య లక్ష్మి కి బీమా పరిహారం రూ.5 లక్షలు అందజేశారు. పిల్లల చదువుకు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొటాన రాము, పల్ల కృష్ణ, సబ్బవరపు నారాయణమూర్తి, బైలపూడి దేముడుబాబు,ఐడీ బాబు,రామారావు పాల్గొన్నారు.

నేడు వాడచీపురుపల్లి నేస్తాలమ్మ పండగ



శ్రీ నేస్తాలమ్మ

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామ పంచాయతీల ప్రజలు ఆరాధ్య దైవం శ్రీ నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. నాయుడుపాలెం శివారు మెట్టపాలెంలో అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. గురువారం వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఆలయానికి చేరుకొని అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు సరఫరా చేయనున్నారు. సాయంత్రం డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, నేల డ్యాన్సులు, కోలాటాలతో అమ్మవారిని వాడచీపురుపల్లి సతకంపట్టు నుంచి భక్తుల దర్శనార్థం ఇరు గ్రామాల్లో ఊరేగిస్తారు.రాత్రికి భారీ బాణ సంచాకాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది.

బడి.. కొత్త ఒరవడి

- నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- రెండోదశలో రూ.25.30 కోట్లు కేటాయింపు
- 58 పాఠశాలలకు నిధుల మంజూరు

పెందుర్తి మండలం సరిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్‌ఈపీ అమల్లో భాగంగా సమీపంలోని హైస్కూల్లో 3,4,5 తరగతులను విలీనం చేశారు. పాఠశాలలో నాడు-నేడు మొదటి విడతలో భాగంగా రూ.19.90 లక్షలతో మౌలిక సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు ఆ పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా తయారైంది.



నాడు-నేడు మొదటి విడతలో అభివృద్ధి చేసిన పెందుర్తి మండలం సరిపల్లి ప్రాథమిక పాఠశాల

విశాఖ విద్య: నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు ఏ రీతిన అభివృద్ధి చెందాయనేది చెప్పడానికి సరిపల్లి ప్రాథమిక పాఠశాల నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. నాడు-నేడు రెండోదశ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ పశ్చిమ నియోజకవర్గం, పెందుర్తి మండలంలోని 58 పాఠశాలల్లో రూ.25.30 కోట్లతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. తొలివిడతలో విశాఖ అర్బన్, పెందుర్తి మండలాల్లో 55 స్కూళ్లు అభివృద్ధి చేశారు. దీనికి కొనసాగింపుగా రెండో విడత పనులు చేపట్టారు. జాతీయ విద్యా విధానం అమలు మేరకు అంగన్‌వాడీల విలీన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో పనులపై విద్యాశాఖాధికారులు మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు.

120 అదనపు గదుల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలో నేపథ్యంలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో అవసరమైన పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణానికి రెండో విడత పనుల్లో ప్రాధాన్యం ఇచ్చారు. విశాఖ అర్బన్, పెందుర్తి మండలాల్లోని 22 హైస్కూళ్లలో 120 అదనపు గదులు నిర్మిస్తున్నారు. ఒక్కో అదనపు గది నిర్మాణానికి రూ. 12 లక్షలు కేటాయించారు.

కార్పొరేట్ లుక్‌తో..

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులను భాగస్వాములు చేసి సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులు సమన్వయంతో పనులు చేపడుతున్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్, గ్రీన్ చాక్‌బోర్డు, ఎల్‌ఈడీ టీవీలు ఇలా సకల సౌకర్యాలు పాఠశాలల్లో సమకూరుతున్నాయి.



పచ్చదనంతో ఆహ్లాదకరంగా పాఠశాల ప్రాంగణం



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ట్యాప్‌లు



పాఠశాల ప్రాంగణంలో సరస్వతీ దేవి విగ్రహం

దేవాలయంతో సమానం



బడి దేవాలయం లాంటిది. ఇక్కడే విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు పడతాయి. అందుకే స్కూల్ అభివృద్ధికి నా సొంత నిధులు కూడా వెచ్చించి సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించాను. విద్యార్థుల బాగు కోసమని ప్రభుత్వం స్కూల్ అభివృద్ధికి నిధులు కేటాయించడం గొప్పవిషయం.

–బీహెచ్. లక్ష్మి, సరిపల్లి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం

సకల వసతులు



నాడు-నేడు పనులతో ప్రభుత్వ స్కూళ్లలో సకల వసతులు కల్పిస్తున్నారు. రెండోదశలో హైస్కూళ్లకు ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించడం మంచి పరిణామం. స్థల సమస్యపై ఊరి పెద్దలతో మాట్లాడి పరిష్కరించుకున్నాం. త్వరలోనే అదనపు గదులు నిర్మాణం ప్రారంభిస్తాం. అవి పూర్తయితే వసతి సమస్య తీరుతుంది. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా పనులపై శ్రద్ధ తీసుకుంటున్నాం.

– వి. సువర్చల, హెచ్‌ఎం, సరిపల్లి హైస్కూల్

'జగనన్నే మా భవిష్యత్' ప్రారంభం నేడు

పరవాడ: జగనన్నే మా భవిష్యత్ సంక్షేమ యాత్రను గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముత్యాలమ్మపాలెంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అర్హులై ఉండి పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. 2024లో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని కోరతామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు మెట్టపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

పరవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నాయుడుపాలెం శివారు మెట్టపాలెం జెడ్పీ పాఠశాలలో గురువారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారని చెప్పారు.

పెదగాడిలో..

సింహాచలం: పెదగాడిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారన్నారు.

ఆశవర్కర్ పోస్ట్ భర్తీ చేయాలి

సబ్బవరం: ఆరిపాక గ్రామంలో ఖాళీగా ఉన్న ఆశ వర్కర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె. నివాస్‌ను కోరారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించిన కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు.

3.40 లక్షల మందికి వైద్య పరీక్షలు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్



వైద్యశిబిరాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్

సబ్బవరం: రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 3.40 లక్షల మంది వరకూ వైద్య పరీక్షలు చేయించుకున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా కమిషనర్ జె. నివాస్ తెలిపారు. మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ నిర్వహించిన శిబిరంలో 500 మంది సేవలు పొందారని చెప్పారు. గర్భిణులు, కౌమార దశ బాలికల్లో వచ్చే రక్తహీనతను నివారించడం కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారని ఆయన అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో లక్షా 98 వేలు మంది పాల్గొని సద్వినియోగం చేసుకున్నారన్నారు. అన్ని విభాగాల నుంచి రోజుకు 11 వేల మంది వరకూ ఉన్నత వైద్యం కోసం సిఫార్స్(రిఫరల్) చేస్తున్నామన్నారు.

కంటి పరీక్షలకు స్పందన

క్యాంపుల్లో కళ్ల పరీక్షలకు విశేష స్పందన లభిస్తుందన్నారు. అవసరమైనవారికి కళ్ల జోళ్లును అందించడంతో పాటు ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, డీఎంహెచ్‌వో హేమంత్, ఎంపీడీవో రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనానికి ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

పరవాడ: వచ్చే నెలలో హిందూ సమ్మేళనం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు చెప్పారు. ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనంలో హిందూ ధర్మానికి సంబంధించిన అన్ని కళల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రతీ గ్రామ ధార్మిక జట్టు నుంచి 100 నుంచి 200 మంది పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతీ వారం దేవాలయం కేంద్రంగా భజన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పౌర్ణమికి సామూహిక హారతి, ఏకాదశికి నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటా ధర్మ ప్రచారం చేపట్టాలని అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో సభ్యులు సీహెచ్. బంగార్రాజు, కొవిరి దుర్గాలు, బొంది మహేష్, సీహెచ్.రాజమ్మ, బొంది దేవి, కాసులమ్మ, బంగారమ్మ, చిన్నారావు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: జీవీఎంసీ 85వ వార్డు గెంజిపేట పూజారికాలనీ, శ్రీరామ్‌నగర్‌లో రూ. కోటి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. పది రోజుల్లోనే పనులు పూర్తి చేసి, రోడ్డు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, 79వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మీనాయుడు, సుందరపు అప్పారావు, కరణం కోటి, కాతా నూకేష్, యలమర్తి వెంకటరావు, కర్రి నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరికలు



కొత్తగా చేరిన వారితో ఈయూ నేతలు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ)కు చెందిన ముగ్గురు బుధవారం ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఎన్ఎంయూకు చెందిన జె.సత్యవంతుడు, బి.రమణరావు, డి.రమేష్ చేరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ఎస్.రావు, జిల్లా కోశాధికారి కెఎంఎస్‌పీ స్వామి, సింహాచలం డిపో గ్యారేజీ కమిటీలు జి.పి.ఎస్.నాయుడు, రమణ, చన్నా, రత్నాజీ, శేఖర్, శ్రీను, రత్నం పాల్గొన్నారు.

450 మందికి వైద్య పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

సింహాచలం: పెందుర్తి మండలం చింతగట్లలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ మధుపాడ నాగమణి ప్రారంభించారు. వైద్యులు, వైద్యసిబ్బంది బీపీ, సుగర్ టెస్టులు చేశారు. మొత్తం 450 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, రాష్ట్ర అయ్యఎరుకల కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎంపీటీసీ అప్పలరాజు, ఎంపీడీవో వసంత, ఈవోఆర్డీ అప్పారావు పాల్గొన్నారు.

తుంపాల కుటుంబానికి అండగా ఉంటాం





తుంపాల అప్పారావు విగ్రహాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సంతాప సభలో పాల్గొన్న అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- జెడ్పీ వైస్ చైర్మన్, దివంగత తుంపాల అప్పారావు విగ్రహావిష్కరణ

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్, మండలంలోని మర్రిపాలేనికి చెందిన స్వర్గీయ తుంపాల అప్పారావు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ భరోసా ఇచ్చారు. ఇటీవల అకాల మరణం చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ స్వర్గీయ తుంపాల అప్పారావు నిలువెత్తు విగ్రహాన్ని గుల్లేపల్లి-కె కోటపాడు రోడ్డులోని మర్రిపాలెం జంక్షన్ వద్ద ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బుధవారం ఆవిష్కరించారు.అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పట్ల అత్యంత నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన నాయకుడు స్వర్గీయ తుంపాల అప్పారావు అని కొనియాడారు. అప్పారావుకు ఒక కుమారుడు మానసిక వికలాంగుడు కాగా మరో కుమారుడు అటవీశాఖలో ఉద్యోగం చేస్తున్నారన్నారు.తమ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి హామీ మేరకు అప్పారావు కుమారుడిని విశాఖకు బదిలీపై తీసుకొస్తామని.. రాజకీయాల్లోకి వచ్చి ఉన్న ఆస్తిపాస్తులు పోగొట్టుకున్న తుంపాల అప్పారావు కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అతని కుమారుడికి 200 చదరపు గజాల స్థలాన్ని ఉచితంగా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తుంపాల అప్పారావు రాజకీయంగా ఎదిగిన తీరును.. పార్టీకి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి,కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పాలిశెట్టి సురేష్ రాజ్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు నారాయణమూర్తి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, ,పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు ముత్యాలనాయుడు,ఉగ్గిన గంగునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- చినముషిడివాడలో వైద్యశిబిరం ప్రారంభం



వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఓపీ నమోదు చేసుకుంటున్న రోగులు

సింహాచలం: ఇళ్ల వద్దే ప్రజల ఆరోగ్య సమస్యల గుర్తించి.. ఒక్క రూపాయి కూడా భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 97వవార్డు చినముషిడివాడలోని అంబేడ్కర్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రం ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రారంభించి మాట్లాడారు. వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదైతే, తండ్రి ఆలోచనలకు అనుగుణంగా మరిన్ని అడుగులు ముందుకేసి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. మహానేత ప్రవేశ పెట్టిన 108, 104 ఆయన మరణించిన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటన్నింటినీ పునరుద్ధరించి పేదల వైద్యానికి భరోసా కల్పించారని చెప్పారు. కొత్తగా మెడికల్ కాలేజీలు నెలకొల్పడంతో పాటు కొన్నివేల పోస్టులు వైద్యరంగంలోనే భర్తీ చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతీ గ్రామంలో వైద్యం అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స అవసరమైతే పెద్దాసుపత్రికి రిఫర్ చేయడం జరుగుతోందన్నారు. ఈ విధానం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. 1300 మందికి ఓపీ సేవలు అందించారు. 600 వరకు పలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ మల్లయ్యానాయుడు, ఏపీడీ శ్రీరామ్, డీఈ విజయ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

198 మందికి వైద్య పరీక్షలు

పరవాడ: ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎంపీడీవో వి.హేమసుందర్రావు అన్నారు. వెన్నలపాలెంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో సర్పంచ్ అప్పారావుకు వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 198 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు పి.కనకారావు, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, వాడచీపురుపల్లి, పరవాడ పీహెచ్‌సీల వైద్యాధికారులు కనకప్పారావు, రంజిత్, పార్టీ నాయకులు పైల సత్యనారాయణ, ఎం.ఎం. నాయుడు, పైల సన్యాసిరావు, పైల మణి, సింహాద్రిరావు పాల్గొన్నారు.



కంటి పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

కంటి పరీక్ష చేశారు



కంటి చూపు సరిగా లేదని చెబితే వైద్యులు కంటి పరీక్షలు చేశారు. కళ్లద్దాలు పెట్టుకోవాలని చెప్పారు. కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇస్తామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా మెరుగైన వైద్యం అదించడం చాలా బాగుంది. ఒకే చోట చాలా మంది వైద్యులు సేవలందించడం మా లాంటి వారికి మంచి అవకాశం. – కె.జ్యోతి, చినముషిడివాడ



సర్పంచ్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది